# హరేకృష్ణ...కృష్ణ...గోవిందా !

## ముకుందా మురారీ అంటూ ఉట్లు కొట్టిన యువత



తిరుమల,ఆగస్ట్ 28ప్రభాతవార్తప్రతినిధి:
నిత్యం గోవిందనామస్మరణలతో...వేలాదిమందిభక్తుల కదలికలతో రద్దీగా ఉండే తిరుమలలో బుధవారం సాయంత్రం ఉట్లోత్సవంతో సందడిసందడిగా మారింది. భక్తులు, స్థానిక యువకులు, ఆలయ అర్చకులు హరేకృష్ణ...కృష్ణ...గోవిందా !ముకుందా మురారీ అంటూ ఉత్సాహంగా ఉట్లు కొట్టారు. ఉట్లోత్సవానికి మలయప్పస్వామి బంగారు తిరుచ్చిపై, శ్రీకృష్ణస్వామి మరో తిరుచ్చిపై ఆలయంలోపల నుండి వెలుపలకు వచ్చి ఆలయం ముందు ఏర్పాటుచేసిన ఉట్లను యువకులు కొట్టగా పర్యవేక్షించారు. అక్కడ నుండి మెల్లగా మాఢవీధుల్లో విహరిస్తూ కోలాహలంగా యువకులు ఉట్లను కొట్టగా స్వామివార్లు ఉత్సాహంగా ముందుకు కదిలారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయంగారు, చిన్నజీయంగారు. టిటిడి ఈఓ జె.శ్యామలరావు దంపతులు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యాచౌదరి, వసతి కల్పన విభాగం డిప్యూటీ ఈఓ భాస్కర్, ఆలయ పేష్కార్ శ్రీహరి ,అర్చకులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## రైతు సేవా కేంద్రాల ఎరువుల గోడౌన్లు తనిఖీ



చిట్టమూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త
చిట్టమూరు మండలంలోని రైతుసేవా ఎరువుల గోడౌన్లను బుధవారం తిరుపతి మార్క్‌ఫెడ్ డిఎం ఎస్.పవన్‌కుమార్ తనిఖీ చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయన మండల పరిధిలోని గునపాడు, మెట్టు, ఉప్పలమర్తి, ఈశ్వరవాక, చిట్టమూరు, మల్లాం, కోగిలి, బురదగాలి కొత్తపాలెం, ఆరూరు, అరవ పాలెం, యాకసిరి రైతు సేవా కేంద్రాల్లోని పాత నిల్వలను పరిశీలించి కొందరు వ్యవసాయ సహాయకులకు నోటీసులు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆయా రైతు భరోసా కేంద్రాలకు వచ్చిన ఎరువుల నిల్వలు, జిల్లా వ్యాప్తంగా ఎరువుల నిల్వలు, అమ్మకాలు పొంతనలేకుండా ఉండటంతో అసలు రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు ఉన్నాయా లేదా, ఉంటే కియోస్కో సేల్ ఎంత జరిగింది, తదితర అంశాలపై పరిశీలించారు. మార్క్‌ఫెడ్ డిఎం వెంట చిట్టమూరు వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్, మార్క్‌ఫెడ్ అధికారి మౌలాలి ఉన్నారు.

## మత్తులో...తుళ్ళుతూ

# కొండెక్కుతున్నారు!

### ఆర్టీసి బస్సుల్లో కంపుకంపు
### -తనిఖీల్లో పట్టించుకోని విజిలెన్స్

ప్రభాతవార్త-తిరుపతి:
తిరుపతి నుండి తిరుమలకు వెళ్ళే కొందరు పారిశుధ్యఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఏజెన్సీల కార్మికులు పీకలదాకా మద్యంసేవించి మత్తులో కొండెక్కేస్తున్నారు. ఏకంగా ఆర్టీసి బస్సుల్లోనే వీరంతా విధులకు ప్రయాణిస్తుండటంతో ఈ కార్మికులతో మద్యం వాసన వస్తుండటంతో తోటి యాత్రికులు, ప్రయాణికులు భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు మహిళా యాత్రికులు మరీ ముక్కులు మూసుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఉంది. ఇదీ ప్రతిరోజూ జరుగుతున్న తంతే అయినా అటు ఆర్టీసి బస్సు డ్రైవర్లుగానీ, బస్సులు తనిఖీ చేసే కంట్రోలర్లుగానీ వీరిని పట్టించుకోవడం లేదు. ఇలా ప్రతి బస్సులో ఇద్దరు ముగ్గురు ప్రైవేట్ పారిశుధ్యకార్మికులు మద్యం మత్తులో కొండకు వెళుతుండటం సాధారణమైపోయింది. సాధారణంగా తిరుమలకు వెళ్ళే బస్సుల్లో ధూమపానం సేవించడం కూడా నిషేధం, పైగా మద్యం సేవించి ఉన్నా వారిని బస్సు ఎక్కించరు. లేకున్నా అలిపిరి తనిఖీ కేంద్రంలో భద్రత సిబ్బంది వారిని క్రిందకు దించేస్తారు. అయితే తిరుమలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఏజెన్సీల కార్మికులు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణిస్తున్నా వారిని అడిగేవారే లేకపోతున్నారు. పైగా కొన్ని సందర్భాల్లో మద్యం మత్తులో భక్తుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. తిరుమలలో ఐదువేలమంది వరకు పారిశుధ్యకార్మికులు ఏజెన్సీల ద్వారా పనిచేస్తున్నారు. వీరంతా తిరుపతి నుండి వెళ్ళే సమయంలో కొందరు మద్యం సేవించి మరీ వెళుతుండటంతో ఇబ్బందిగా మారింది. మద్యంసేవించి మత్తులో వీరంతా విధులు ఎలా నిర్వహిస్తారనేది కూడా భక్తుల్లో చర్చమొదలైంది. ప్రతిరోజూ తిరుమలకు ఆర్టీసి బస్సుల్లో 40వేలమంది వరకు భక్తులు ప్రయాణిస్తున్నారు. ఈ సమయంలో మద్యంసేవించి మత్తులో ఉంటున్న కార్మికులతో తంటాలు తప్పడంలేదు. పైగా యాత్రికుల లగేజీలను ,వారిని నిశితంగా తనిఖీ చేసి పంపే భద్రత సిబ్బందికి మద్యం మత్తులో ఉండే కార్మికులు కనిపించరా?అనేది ఇప్పుడు ప్రశ్నార్థకమే. తిరుమల పవిత్రతను కాపాడటంలో కార్మికులు ప్రధానం. అలాంటిది మరీ ఇలాంటి మద్యంసేవించి మత్తులో కొండెక్కుతున్న కాంట్రాక్టు కార్మికులపై ఇకనైనా ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సిందే.


ఫోటో: లోగో

## శ్రీకాళహస్తి మున్సిపల్

# కొత్త కమిషనర్ ఎవరు?



శ్రీకాళహస్తి,ఆగస్టు 28 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబును పొన్నూరు మున్సిపాలిటికి బదిలి చేసారు. అయితే ఆయన స్థానంలో ఎవరిని నియమించారో ఇంకా తేలలేదు. ఇక్కడ పని చేసిన రమేష్‌బాబు బదిలి కావటంతో కొత్త కమిషనర్ నియామకం ఇంకా సస్పెన్స్‌లోనే ఉంది.అయితే శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆడిట్ విభాగంలో తిరుపతి మున్సిపాలిటిలో పని చేస్తున్న అడినల్ కమిషనర్ చరణ్‌తేజరెడ్డికి అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అయితే ఇతర శాఖల నుంచి వచ్చే వారితో తమ ప్రమోషన్లకు ఆటంకంగా మారిందని మున్సిపల్ ఉద్యోగుల సంఘం మంత్రికి, ప్రభుత్వానికి విన్నవించారు.అయితే రాష్ట్రంలో ఇంకా పలువురు కమిషనర్లకుఅ వకాశం కల్పించలేదు. అయితే ఇక్కడ పని చేసిన రమేష్‌బాబు బుధవారం రిలీవ్ అయ్యారు.ఆయన బాధ్యతలను మేనేజర్ ఉమామహేశ్వరరావుకు అప్పగించారు. తిరుపతి మున్సిపాలిటిలో అడిషనల్ కమిషనర్‌గా పని చేస్తున్న చరణ్‌తేజ రెడ్డికి పరిపాలనలో అనుభవం ఉన్నట్లు తెలిసింది.అంతేకాక తిరుపతిలో పని చేస్తున్న ఆయనకు శ్రీకాళహస్తి మున్సిపాలిటి స్థితి గతులపై అవగాహన ఉన్నట్లు చెబుతున్నారు. అధికారుల నియామకాల్లో శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ఆచితూచి వ్యవహారిస్తున్నారు. జవాబుదారి తనంతో క్రమశిక్షణతో పని చేసే అధికారులను నియమించుకకుంటున్నారు. అభివృద్దిని వేగంగా చేపట్టే అధికారులకు ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నారు.ఈ నేపధ్యంలోనే రెవెన్యూ,పోలీసు,దేవాదాయ, మున్సిపల్ శాఖలపై ప్రత్యేక దృష్టి సారించారు.ఇక ఐదేళ్ళు పూర్తి చేసుకున్న సిబ్బందికి కూడా స్థాన చలనం కల్గుతుందని భావిస్తున్నారు.ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో 15 నుంచి 20 మంది సిబ్బంది బయటకు వెళ్ళాల్సి వస్తుందని భావిస్తున్నారు.

## కండలేరునుంచి శ్రీసిటీ వరకు

# నీటి సరఫరా అడ్డంకులకు భూ సేకరణ..



డక్కిలి,ఆగష్టు 28,ప్రభాతవార్తః
రాపూరు మండలం కండలేరు నుంచి తడ మండలం శ్రీసిటీ వరకు తాగునీటిని అందించే పైపులైన్‌ను భూ సేకరణకు సంబంధించి అడ్డంకులను తొలగించేందుకు బుధవారం స్థానిక అధికారులతో పాటు తిరుపతి జిల్లా భూ సేకరణ అధికారులు పలు గ్రామాల్లో పర్యటించారు.స్థానిక తహసీల్దార్ మోపూరు శ్రీనివాసులు అధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది. మొదట పైప్‌లైన్‌కు సంబందించి రైతుల భూములు, ప్రవేటు భూములు,వివిధ రకాల భవ్ఃనాలు, పలు దేవస్థానాలు ఈపైప్‌లైన్ నిర్మాణాల్లో ఉన్నట్లు అధికారు లు ప్రాథమికంగా గుర్తించారు. అనంతరం మండలంలోని వెలికల్లు గ్రామంలో ఈపైప్‌లైన్‌కు సంబంధించి భూ సేకరణ గ్రామ సభను నిర్వహించారు.ఇందులో భాగంగా రైతలు అభిప్రాయులను అధికారులు తెలసుకున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి తాము సాగు చేసుకుంటున్న భూములులో పైపులైన్ నిర్మాణాల్లో భూమిని కోల్పోతున్నామని పలువురు రైతులు అధికారులకు వివరించారు.దీంతో స్పందించిన డక్కిలి తహసీల్దార్ ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులందరికీ పైప్‌లైన్ నిర్మాణంలో భూములు కోల్పోతే ప్రభుత్వం నుంచి నష్టపరిహారం ఇప్పస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా తిరుపతి జిల్లా భూ సేకరణ అధికారి కేపీ నరసింహులు మాట్లాడుతూ పైప్‌లైన్ నిర్మాణంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటా మన్నారు.అంతే గాక భూ సేకరణలో ఎటువంటి అక్రమాలకు చోటు లేకుండా ఉంటామన్నారు.

# పుంగనూరుకు పరిశ్రమల ఏర్పాటు అవసరం

### -మంత్రి వాసంశెట్టి సుభాష్

పుంగనూరు,ఆగస్టు 28 ప్రభాతవార్త
రాష్ట్రానికి చివరన,కర్నాటక సరిహద్దులో పూర్తి మెట్టప్రాంతంలో ఉన్న పుంగనూరు నియోజకవర్గానికి పరిశ్రమల ఏర్పాటు వల్లనే సమస్యలు పరిష్కారమౌతాయని కార్మిక,ఫ్యాక్టరీలు,మరియు కార్మికబీమా వైద్యసేవల శాఖల మాత్యులు వాసంశెట్టి సుభాష్ అభిప్రాయపడ్డారు. బుధవారం తెలుగుదేశంపార్టీ యువనాయకుడు ఆర్వేటి నగేష్‌బాబు మంత్రివర్యులతో గతంలో ఉన్న పరిచయంతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా గత పదేళ్ళలో పుంగనూరు నియోజకవర్గ అస్తవ్యస్త పరిస్థితులకు కారణాలను చర్చించినట్లు తెలిసింది. నియోజకవర్గానికి పరిశ్రమలు తెస్తున్నట్లు హడావుడి సృష్టించి గ్రాఫిక్స్‌మాయాజాలాన్ని సృష్టించి, భూములను స్వాధీనం చేసుకుని,పేదలను తీవ్ర ఇబ్బందులకు చేసిన ఘనత గత ప్రభుత్వ నాయకులకు చెల్లిందన్నారు. పుంగనూరులో క్రికెట్‌బ్యాట్‌లు, బ్యాటరీలు, జర్మన్‌బస్సులు వచ్చేస్తున్నాయంటూ మాయా జాలం సృష్టించిన మాజీ మంత్రిపెద్దిరెడ్డి ప్రజలను మోసం చేయడం విచారకరమని వాఖ్యానించినట్లు తెలిసింది. పుంగనూరులో చింతపండు,టమోటా అధిక ఉత్పత్తుల కారణంగా ప్రభుత్వం వెంటనే పల్ప్‌పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, ఇందుకు సంబంధించి తన స్వంతభూములు కూడా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆర్వేటిబాబు మంత్రికి వివరించారు. పార్టీనియోజకవర్గ నాయకులు చల్లాబాబు సారధ్యంలో ముఖ్యమ ంత్రి ద్వారా మంచి అభివృద్ధికార్యక్రమాల మంజూరుకు ప్రయత్నిస్తామన్నారు.

## నాయుడుపేట గురుకులంలో

# మళ్లీ గుబులు

### - 11 మంది విద్యార్థులకు అస్వస్థత
### - బాధ్యులపై చర్యలకు తల్లిదండ్రుల డిమాండ్





నాయుడుపేటలోని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

నాయుడుపేట, ఆగస్టు 28 ప్రభాతవార్త
నాయుడుపేటలోని డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ గురుకులంలో నెలరోజులు గడవక ముందే మరోసారి విద్యార్థులు అస్వస్థతకు గురికావడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే ఇదే గురుకులానికి చెందిన 126 మంది విద్యార్థులు పాచిపోయిన ఆహారం తినడం ద్వారా జిల్లాలోని ఆసుపత్రుల్లో విద్యార్థుల అరణ్యరోదనలతో మంత్రులు, కలెక్టర్, ప్రజాప్రతినిధులు నాయుడుపేట గురుకులాన్ని సందర్శించి పలు సూచనలు చేయడంతో పాటు ప్రిన్సిపాల్, ఓ డాక్టర్‌ను సైతం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఇదే సమస్యతో గురుకులంలోని 11 మంది విద్యార్థులకు రెండురోజులుగా వాంతులు, విరేచనాలు అవుతున్న విషయం తెలిసి కూడా బయటకు తెలియనివ్వకుండా ఆ విద్యార్థులను కట్టడి చేయడంతో పాటు వారిని కొట్టినట్లు కూడా చెప్తున్నారు. అయితే పరిస్థితి మరోమారు తమచేయి దాటిపోతుందన్న భయంతో ప్రిన్సిపాల్ దాదాపీర్ విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో వారంతా గురుకులానికి చేరుకొని తమ పిల్లలను ప్రైవేటు వైద్యశాలలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇదిలావుంటే విషయం తెలుసుకున్న తహశీల్దార్ గీతావాణి, కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, డిప్యూటి తహశీల్దార్ రాజేంద్ర గురుకులాన్ని సందర్శించి గురుకులంలో అన్ని వసతులు సమగ్రంగా ఉన్నట్లు ప్రిన్సిపాల్ దాదాపీర్ చెప్పిన ప్రకారం ఆదివారం తల్లిదండ్రులు తెచ్చిన ఆహారం వల్లే వాంతులు, విరేచనాలతో కొందరు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారన్నారు. ఏదిఏమైనా గురుకులంలో చదువుకునే పేద దళిత విద్యార్థులకు అక్కడ భద్రత లేదన్న అభిప్రాయంతో పాటు అధికారుల పర్యవేక్షణ లోపం, గురుకుల సిబ్బంది నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా కనిపిస్తుండటం పట్ల తరచూ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నట్లు పలువురు విమర్శలు చేస్తున్నారు.

# శ్రీకాళహస్తీశ్వరుని హుండీ రాబడి రూ.1.97కోట్లు

శ్రీకాళహస్తి,ఆగస్టు 28 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరుని హుండీ రాబడి రూ.1.97కోట్లుదాటిందని ఆలయ ఇఓ ఎన్‌వియస్‌ఎన్ మూర్తి బుధవారం తెలిపారు. 35 రోజుల పాటు భక్తులు ఆలయంలోని స్వామి అమ్మవార్లు, పరివార దేవతల ఆలయాల వద్ద హుండీల్లో సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించామన్నారు. హుండీల ఆదాయాలు గత మూడు నెలలుగా అమలు చేస్తున్న సంస్కరణలతో గణనీయంగా పెరుగుతుందన్నారు. ఈ నెల 1కోటి 97లక్షల 72వేల 140లు వచ్చినట్లు తెలిపారు.ఆలయంలో శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి పలు సంస్కరణలు అమలు చేయుటకు సూచించారని వాటి ఆధారంగా శివయ్య రాబడి పెరిగిందన్నారు.రాబోవు రోజుల్లో ఇంకా ఆదాయాలు పెరుగుతాయని అభిప్రాయం వ్యక్తం చేసారు. బుధవారం హుండీల్లో బంగారు 000.098.000 వచ్చిందని వెండి నాగపడగలు 605.100కిలోలు వచ్చిందన్నారు. కాగా యుయస్‌ఏకి సంబంధించిన డాలర్లు 112 వచ్చాయని మలేషియాకు సంబంధించిన కరెన్సి 78 ఇతర కరెన్సి 36 వచ్చాయని తెలిపారు.ఈ లెక్కింపుల్లో ఇఓతో పాటు అర్చకులు వేదపండితులు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంక్రిమెంట్లు పెట్టుకో.. లక్షల జీతం దండుకో !!

### - కుప్పం రెస్కోలో ఓ అధికారి అక్రమాల లీల !!



కుప్పం, ఆగస్టు 28 ప్రభాతవార్త
సాధారణ కంప్యూటర్ పరిజ్ఞానం తెలిసిన వ్యక్తిని కంప్యూటర్ ప్రోగ్రామర్‌గా చేర్చుకుని అతనికి జూనియర్ అసిస్టెంట్ హోదా కల్పించి రెగ్యులర్ చేశారు. ఇంకేముంది అతను ఏకంగా సుమారు 11 ఇంక్రిమెంట్లు పెట్టుకుని నేడు అతని కంటే సీనియర్లుగా ఉన్న వారి జీతాల కంటే అధికంగా తీసుకుంటూ సంస్థ ఆదాయానికి గండికొడుతున్నారు. ఈ వ్యవహారం కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో)లో చోటు చేసుకుంది. ఏ ఎండకు ఆ గొడుగు పడుతున్న ఆ ఉద్యోగి సహాయ అక్కౌంట్స్ అధికారిగా ఉంటూ వచ్చే నెలనుంచి ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం హెడ్ కావాలని తహతహలాడుతూ పావులు కదుపుతున్నట్లు సమాచారం. సదరు ఈ ఉద్యోగి 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెస్కోలో విధుల్లో చేరాడు. అతని బేసిక్ పేస్కేల్ 4740రూ.లనుంచి మొదలవ్వాలి. వేతనాన్ని ఓచర్‌లో సంతకాలు తీసుకుని ఇచ్చేవారు. రెగ్యులర్ అయ్యాక ఏకంగా 11 ఇంక్రిమెంట్లను తనపనితనం చూపి పెంచుకున్నట్లు తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. అలా ఇంక్రిమెంట్లతో కలిపి అతను కాలక్రమేణా పదోన్నతులు పొందడం చోటు చేసుకుంది. ఇంకేముంది.. ఆయన గారి వేతనం అతని కంటే సీనియర్లుగా విధుల్లో ఉన్న వారికంటే అధికంగా మారిపోయింది. నేడు ఆ ఉద్యోగి వేతనం దాదాపు 1.72 లక్షలకు చేరిపోయింది. ఇతని జీతం, ప్రమోషన్లపై రెస్కో ఉన్నతాధికారులే ముక్కున వేలేసుకుంటున్నారు. కాగా 2020లో అప్పటి పాలకవర్గం ఇతని జీతభత్యాలను పరిశీలించి అధికజీతం పొందుతున్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేయగా అతను తన జీతంలో కోత విధించారని2021లో హైకోర్టును ఆశ్రయించాడని సమాచారం. అయితే కోర్టు అతని స్థాయికి తగినవేతనం ఇతర ఉద్యోగులకు ఎలా ఇస్తున్నారో అలాగే ఇవ్వాలని అలాగని జీతం తగ్గించరాదని, పెంచరాదని ఉత్తర్వులు జారీ చేస్తూ ఇంటీరియర్ స్టే ఇచ్చినట్లు తెలిసింది. తదనంతరం ఈ ఉద్యోగి గతేడాది తన రాజకీయపలుకుబడి ఉపయోగించి అప్పటి ప్రభుత్వంలో కీలకమైన వ్యక్తుల ద్వారా సంస్థలో ఉద్యోగులపై ఒత్తిళ్లు తెచ్చినట్లు సమాచారం. ఇప్పటివరకు ఈ ఉద్యోగి ఇంక్రిమెంట్లు పెంచుకున్న నేపథ్యంలో దాదాపు 40లక్షలు అదనంగా వేతనరూపంలో పొందినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. కాగా ఇతను కంప్యూటర్ సెక్షన్ కంట్రోల్ చేస్తుంటారని అలా తనకు అవసరమైన వారి విద్యుత్ సర్వీసుల బకాయిలను సైతం ఆన్‌లైన్‌లో లేకుండా చేశారనే ఆరోపణలు ఉన్నాయి.ఇతని వ్యవహారశైలిపై ఇదివరకే కొంతమంది సహచర ఉద్యోగులు సైతం సహకార శాఖ కమీషనరుకు

# ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కట్టుబడి విధులు

### - జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు

చిత్తూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త:
ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి విధులు నిర్వహిస్తున్నాయని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల ఆర్థికాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరివిగా నిధులు మంజూరు చేస్తున్నాయన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో వివిధ కేడర్లకు సంబంధించి ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు అమలు చేయడం లేదని పార్లమెంటులో చర్చించిన సందర్భంగా 2023 పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ, ఎస్టీలకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ఎంపీలు లేవనెత్తడంతో సర్కులర్ ఇవ్వడం జరిగిందని, ప్రభుత్వ శాఖలు, జిల్లా, మండల స్థాయిల్లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. 2024-25 సంవత్సరానికి తనను పార్లమెంటు ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీలో సభ్యుడిగా నియమించిందని, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఆర్థికంగా అభివృద్ధికి ఇన్‌పుట్ అందజేస్తే ప్రతి 15 రోజులకు పార్లమెంటులో ఎస్సీ, ఎస్టీ కమిటీ సమావేశం జరుగుతుందని, ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు ఇచ్చిన ఇన్‌పుట్‌ను చర్చించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను రైతులకు అందిస్తున్నామని, జిల్లాకు 21 వేల హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం సాగు చేయాలనే లక్ష్యంను ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90 శాతం రాయితీలో బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను అందజేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 10 వేల హెక్టార్లకు సంబంధించి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని, ఇందులో ఎస్సీ, ఎస్టీ రైతులు తక్కువ మంది వున్నారని, దీనిపై వారికి పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు, డివిఎంసి సభ్యులకు సూచించారు.



## ఎస్ఐగా ఈశ్వర్‌యాదవ్ బాధ్యతలు స్వీకరణ

యాదమరి, ఆగస్టు 28 ప్రభాతవార్త:



యాదమరి ఎస్ఐగా ఈశ్వర్‌యాదవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. యాదమరి ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న రామాంజనేయులు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఎస్ఐగా ఈశ్వర్‌యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్ఐ ఈశ్వర్‌యాదవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పూర్తి సహకారం అందించాలని ప్రజాప్రతినిధులు, ప్రజలను ఈ సందర్భంగా ఎస్ఐ ఈశ్వర్‌యాదవ్ కోరారు.

## శెట్టేపల్లిలో తెదేపా పతాకావిష్కరణ

శాంతిపురం, ఆగస్టు 28 ప్రభాతవార్త



మండలంలోని మఠం పంచాయతీ శెట్టేపల్లి గ్రామంలో బుధవారం కుప్పం టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం తెదేపా పతాకాన్ని ఆవిష్కరించారు. సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పార్టీ పతాకావిష్కరణలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, సర్పంచ్ జనార్ధనరెడ్డి, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్,ఎల్.జయరాంరెడ్డి, తెలుగుమహిళ నేతలు అనసూయ, సుగుణమ్మ, చెక్కునత్తం మణి, జెకె సంతోష్, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

## దుకాణదారులు సిసి కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలి

శాంతిపురం, ఆగస్టు 28 ప్రభాతవార్త



మండలంలో ఉన్న దుకాణదారులు తమ షాపులకు నాలుగువైపులా సిసి కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలని రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సై నరేష్ కోరారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవలి కాలంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడుతున్నారని సిసి కెమెరాలు ఉంటే నిందితులను పట్టుకునేందుకు త్వరగా అవకాశం ఉంటుందన్నారు. ఎవరైనా ప్రజలు తమ బంధువుల ఇళ్లకు లేదా సుదూర ప్రాంతాలకు వెళ్లే సమయంలో ఇంట్లోని విలువైన వస్తువులు తమ వెంట తీసుకెళ్లాలని సూచించారు. అలా కాని పక్షంలో పోలీసులకు సమాచారం ఇస్తే లాక్డ్‌హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టం కింద వారి ఇళ్ల వద్ద పోలీసు నిఘా ఏర్పాటుచేస్తామన్నారు. ప్రజలు చోరీల నివారణకు సహకరించాలని కోరారు.

## ఎంపిడిఒచే ఉపాధిహామీ పనుల తనిఖీ

శాంతిపురం, ఆగస్టు 28 ప్రభాతవార్త



మండలంలోని అబకలదొడ్డి, తుమ్మిశి పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపిడిఒ ప్రేమ్‌రాజ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వలసల నివారణ, భూగర్భజలాల పెంపుకు ఉపాధిపనులు చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలో ప్రస్తుతం 2429మంది కూలీలు పనిచేస్తున్నారన్నారు. ఉపాధి పనుల్లో ఎలాంటి అవకతవకలకు అవకాశం ఇవ్వరాదని సిబ్బందికి హెచ్చరించారు. మండలంలో 6.95కోట్ల విలువైన పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఉపాధి సిబ్బంది పనులు కల్పించకుంటే కూలీలు వెంటనే తమ దృష్టికి తేవాలని ఆయన సూచించారు.

## ఘనంగా శ్రీఎల్లమ్మ తల్లి జాతర

కుప్పంరూరల్, ఆగస్టు 28 ప్రభాతవార్త



మండలంలోని చిన్నబంగారునత్తం గ్రామ దేవత శ్రీఎల్లమ్మ తల్లి జాతర ఘనంగా జరుగుతోంది. బుధవారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం జరిపారు. తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, సర్పంచ్ రోహిత్ రవి, ఎంపిటిసి శ్రీనివాసులు, నేతలు చెక్కునత్తం మణి, జెకె సంతోష్, గిరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం, ఆగస్టు 28 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి భక్తులు గురువారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు నంద్యాలకు చెందిన లక్ష్మీ, ఈశ్వరమ్మ అనే భక్తులు నిత్యాన్నదానంకు 1,00,116 రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని దాతలు ఆలయ ఈఓ కె.వాణికు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు.ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవిలతో పాటు దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## మిట్టపల్లెలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఘనంగా భూమిపూజ

తవణంపల్లె. ఆగస్టు 28 ప్రభాతవార్త:

మండలంలోని మిట్టపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించనున్న కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మాణానికి గురువారం భూమిపూజ కార్యక్రమంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. సుమారు కోటి రూపాయల వ్యయంతో గ్రామస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న ఆలయ నిర్మాణ భూమిపూజ కార్యక్రమంకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పండితుల మంత్రోచ్చారణ నడుమ ఎమ్మెల్యే శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. భూమిపూజ కార్యక్రమంకు విచ్చేసిన ఎమ్మెల్యేకు మిట్టపల్లె గ్రామస్థులు, మండల టీడీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు సీఆర్. రాజన్, మండల నాయకులు వెంకటేష్ చౌదరి, దిలీప్ భాస్కర్‌నాయుడు,అమరేం ద్రనాయుడు, పట్నం గోపీ యాదవ్, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, స్థానిక నాయకులు సునీల్, ఎంఆర్ ముని రత్నం, వెంకటరమణ, శ్రీధర్,శ్రీనివాసులతో పాటు పలువురు నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పట్టుబడిన అక్రమ మద్యం ధ్వంసం

పాలసముద్రం, ఆగస్టు 28 ప్రభాతవార్త:



పాలసముద్రం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన మద్యం మొత్తంను బుధవారం ఎస్ఐ భారతి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారుల సమక్షంలో కార్వేటినగరం అటవీ ప్రాంతంలో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ భారతి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పట్టుబడిన అక్రమ మద్యంతో పాటు గత రెండేళ్ళుగా పోలీస్ తనిఖీల సందర్భంగా వివిధ సందర్భాల్లో పట్టుబడిన 1,460 అక్రమ మద్యం బాటిళ్ళు, 390 లీటర్ల నాటుసారాను సెబ్ సూపరిటెండెంట్ వై.శ్రీదర్‌రావు, కార్వేటినగరం సెబ్ అధికారుల సమక్షంలో ధ్వంసం చేయడం జరిగిందన్నారు. ధ్వంసం చేసిన అక్రమ మద్యం విలువ రూ.7.40 లక్షలు వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ మురుగేష్, పోలీసు సిబ్బంది, సెబ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అత్యధిక మందికి బిజెపి సభ్యత్వం

పాలసముద్రం, ఆగస్టు 28 ప్రభాతవార్త:



పాలసముద్రం మండల పరిధిలో అత్యధిక మందికి బిజెపి సభ్యత్వం ఇప్పించడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు చంద్రశేఖర్ నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని మణిపురం గ్రామంలోని ఎల్లమ్మ తల్లి ఆలయం వద్ద బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు చంద్రశేఖర్‌నాయుడు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయి నుండి బిజెపి నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళి వారికి అవగాహన కల్పించి వారిని బిజెపిలోకి ఆకర్షించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మరాజు, నాయకులు బాలయ్య, రామరాజు, చిన్నస్వామి, శ్రీనివాసులు, మురళళీ, ధరణి, ఈశ్వర్, దేవయ్య, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సిఐ రాంభూపాల్‌ను సన్మానించిన ఎమ్మార్పీఎస్

చౌడేపల్లి, ఆగస్టు 28 ప్రభాతవార్త



పుంగనూరు రూరల్(చౌడేపల్లి) సిఐ రాంభూపాల్‌ను ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు ఘనంగా సన్మానించారు. బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయనకు పుష్పగుచ్ఛమందించి దుశ్శాలువాలతో సన్మానించారు. ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అధ్యక్షులు అందలపల్లి ఆంజప్ప, బాజీగం హరిబాబు, ఉపాధ్యక్షులు మల్లూరి హరిబాబు, పగడాల గోవిందు, నాయకులు రెడ్డెప్ప, లోకేష్, బుడ్డన్న, శేఖర్, సుబ్రమణ్యం, గణ తదితరులు సన్మానించిన వారిలో వున్నారు.

## ఆర్ఎంపి కేంద్రాల్లో ప్రైవేటు వైద్యం వద్దు : డాక్టర్ ప్రవీణ్

చౌడేపల్లి, ఆగస్టు 28 ప్రభాతవార్త



ఆర్ఎంపి, పిఎంపి ప్రథమ చికిత్సాలయాల్లో ప్రైవేటు వైద్యం చేయరాదని లద్దిగం ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్ అన్నారు. మండలంలోని పంచాయతీ కేంద్రం ఎ.కొత్తకోటలో గల ఆర్ఎంపి ప్రథమ చికిత్సాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసారు. ఆర్ఎంపి, పిఎంపి ప్రథమ చికిత్సాలయాలకు వచ్చే రోగులకు శస్త్ర చికిత్స పరమైన వైద్యం చేయరాదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి వైద్యమందించాలనీ, అతిక్రమిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రిన్సిపల్ జూనియర్ కోర్టు న్యాయమూర్తిగా ఘనస్వాగతం

పుంగనూరు,ఆగస్టు 28 ప్రభాతవార్త



ప్రిన్సిపల్ జూనియర్ కోర్టు న్యాయమూర్తిగా కె. కృష్ణవంశీ నియమితులయ్యారు.న్యాయమూర్తిగా మొదటిసారిగా పుంగనూరుకు ఆయన నియమితులు కావడంతో బార్ సభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్రంలోని విజయనగరంకు చెందిన కృష్ణవంశీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం న్యాయవాదులతో ముచ్చటించారు. రాష్ట్రంలోనే అత్యంత ఎక్కువ లిటిగేషన్ కేసులున్న పుంగనూరు లాంటి ప్రదేశంలో బాధ్యతలు నిర్వహించడంవల్ల విధినిర్వహణలో మంచి పదును లభిస్తుందని సీనియర్ న్యాయవాదులు వాఖ్యానించారు. కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

## మున్సిపాలిటీచే 2న మెగా రక్తదానశిబిరం

-కమీషనర్ నర్సింహప్రసాద్

పుంగనూరు,ఆగస్టు 28 ప్రభాతవార్త



మున్సిపల అధికారులు,సిబ్బంది,ప్రభుత్వ కార్యాలయాలు, వైద్యశాలలు,ఇతర ప్రభుత్వ సంబంధ శాఖల అధ్వర్యంలో సెప్టెంబరు 2న మెగా రక్తదాన శిబిరం నిర్వహిసున్నట్లు మున్సిపల్ కమీషనర్ నర్సింహప్రసాద్ తెలిపారు. బుధవారం ఈమేరకు తనను కలసిన ప్రభుత్వవైద్యశాల సిబ్బందితో మాట్లాడుతూ చికిత్సలు పొందుతున్న వారికి రక్తం యొక్క అవసరం నానాటికీ పెరిగిపోతున్న దరిమిలా ప్రతిఒక్కరూ రక్తదానం చేయడానికి ముందకు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. రక్తదానం చేయడం వల్ల వ్యక్తుల ఆరోగ్యం మెరుగుపడడమే కాకుండా ఆపద సమయాలలో ఎంతో సాయం చేసినట్లవుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యశాల,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు కుప్పంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త:** కుప్పం ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆయన ఆదేశించారు. అలాగే ఈ కార్యక్రమంను సద్వినియోగం చేసుకుని కుప్పం నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోరారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## రైతు సేవా కేంద్రాల ఎరువుల గోడౌన్ల తనిఖీ

– చిట్టమూరులో మార్క్‌ఫెడ్ డిఎం సుడిగాలి పర్యటన

చిట్టమూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త



చిట్టమూరు మండలంలోని రైతుసేవా ఎరువుల గోడౌన్లను బుధవారం తిరుపతి మార్క్‌ఫెడ్ డిఎం ఎస్.పవన్‌కుమార్ తనిఖీ చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆయన మండల పరిధిలోని గునపాడు, మెట్టు, ఉప్పలమర్తి, ఈశ్వరవాక, చిట్టమూరు, మల్లాం, కోగిలి, బురదగాలి కొత్తపాలెం, ఆరూరు, అరవపాలెం, యాకసిరి రైతు సేవా కేంద్రాల్లోని పాత నిల్వలను పరిశీలించి కొందరు వ్యవసాయ సహాయకులకు నోటీసులు జారీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆయా రైతు భరోసా కేంద్రాలకు వచ్చిన ఎరువుల నిల్వలు, జిల్లా వ్యాప్తంగా ఎరువుల నిల్వలు, అమ్మకాలు పొంతనలేకుండా ఉండటంతో అసలు రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు ఉన్నాయా లేదా, ఉంటే కియోస్కో సేల్ ఎంత జరిగింది, తదితర అంశాలపై పరిశీలించారు. మార్క్‌ఫెడ్ డిఎం వెంట చిట్టమూరు వ్యవసాయాధికారి సుచేంద్రప్రసాద్, మార్క్‌ఫెడ్ అధికారి మౌలాలి ఉన్నారు.

## బీడు భూములను గుర్తించండి

– విఎఎలకు ఎడి సుచేంద్రప్రసాద్ సూచన

చిట్టమూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త



ఆయా పంచాయతీల్లో ఖాళీగా ఉండే పంట పొలాలు, బీడు భూములను త్వరితగతిన గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని నాయుడుపేట వ్యవసాయశాఖ ఇన్‌ఛార్జ్ ఎడి సుచేంద్రప్రసాద్ విఎఎలకు సూచించారు. బుధవారం చిట్టమూరు రైతు సేవా కేంద్రంలో విఎఎలతో సమావేశమైన ఆయన గ్రామ రెవెన్యూ పటాల ద్వారా ఏ సర్వే నంబర్లలో పంట నమోదు కాలేదో గుర్తించి అందుకు గల మూడు రకాల అంశాలపై కారణాలను వివరించాలని తెలిపారు. ఇందులో భాగంగా ఒక సంవత్సరంలోపు ఖాళీగా ఉండే భూములు, ఒకటి నుంచి ఐదు సంవత్సరాలు పంటలు లేని భూముల వివరాలతో పాటు గత ఐదేళ్ల కాలంగా ఎంత విస్తీర్ణం సాగులో లేదో త్వరితగతిన గుర్తించాలన్నారు. అలాగే ఆయా రైతు సేవా కేంద్రాలకు చేరుకున్న పచ్చిరొట్ట ఎరువుల అమ్మకాలను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని సూచించారు.

## విద్యుదాఘాతంతో గేదె మృతి

చిట్టమూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త



మండల కేంద్రమైన చిట్టమూరులోని ఆల్ఫా స్కూలు సమీపంలో విద్యుదాఘాతానికి గురై గేదె మృతిచెందడంతో పాటు గేదెలను మేపుతున్న యజమాని స్వాతికి విద్యుత్ షాక్ తగిలినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఉదయం 10 గంటల సమయంలో చిట్టమూరు బిసి కాలనీకి చెందిన స్వాతి అనే మహిళ తమ జీవనాధారమైన గేదెలను పంట పొలాల్లోకి తోలుకెళ్లింది. అయితే అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద స్టే వైరుకు గేదె కొమ్ములు తగులుకోవడంతో వైరు తెగిపడింది. దాంతో గేదె అక్కడికక్కడే మృతిచెందింది. అయితే పక్కనే ఉన్న స్వాతికి సైతం విద్యుత్ షాక్ తగలడంతో ఆమెను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఈ విషయంపై స్థానిక లైన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులును వివరణ కోరగా, గేదె మృతిచెందడంలో విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం ఏమీ లేదని అనుకోకుండా స్టే వేరుకు తగిలిన గేదె బలవంతంగా లాగడంతో ప్రమాదం జరిగిందని తెలియజేశారు. అయితే తమ కుటుంబ జీవనాధారమైన గేదె మృతిచెందడం, యజమానికి సైతం విద్యుత్ షాక్ తగలడంతో కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## వీధి దీపాలు వెలగక అవస్థలు పడుతున్న ప్రజలు

మండిపడ్డ కౌన్సిలర్ శంకరయ్య

వెంకటగిరి, ఆగస్టు 28, ప్రభాతవార్త



పట్టణంలోని ముత్తరాశి పాలెం, కోర్టు సెంటరు బొగ్గుల మిట్ట, ధర్మపురం, ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదని కౌన్సిలర్ ఆరి శంకరయ్య మండిపడ్డారు. వీధి దీపాలు వెలగడం లేదని చైర్ పర్సన్ నక్క భానుప్రియ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా ప్రయోజనం లేదన్నారు. వీధి దీపాలు వెలగకపోవడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. నెల రోజుల్లో జాతర ఉందని జాతర నాటికైనా దీపాలు వెలిగిస్తే బాగుంటుందని ఆయన తెలిపారు. దీపాలు వెలగకుండా ఉన్న సమస్యను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి తీసుకుని వెళ్తానని తెలిపారు. పట్టణంలో అనేక సమస్యలు ఉన్నాయని వాపోయారు.

## ఎమ్మెల్యే చేతుల మీదుగా మాతమ్మ గుడి నిర్మాణానికి శంకుస్థాపన

గూడూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త



గాంధీనగర్ ప్రాంతంలో దండోరా కాలనీలో దాతల సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న మాతమ్మ దేవస్థానం నిర్మాణ పనులను గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్‌తో పాటు ప్రముఖ పారిశ్రామికవేత్త తానంకి నానాజీ పేన్వర్ రొయ్యల పరిశ్రమ డైరెక్టర్ గంట మధు కృష్ణతో కలిసి బుధవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక టిడిపి నాయకులు వీరి రాకతో ఘన స్వాగతం పలుకుతూ గజమాలతో సత్కరించారు. టిడిపి నాయకులు నెలబల్లి బాస్కర్ రెడ్డి, బిల్లు చెంచురామయ్య, కొండూరు వెంకటేశ్వర రాజు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, రహీం, పెంచలయ్య పాల్గొన్నారు.

## మాతృ శిశు మరణాలపై జిల్లా వైద్య అధికారులచే సమీక్షా సమావేశం

చిల్లకూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త



చిల్లకూరు మండలంలోని చిల్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని తిరుపతి జిల్లా నుండి టాస్క్‌ఫోర్స్ టీం పరిశీలించారు, బుధవారం ఓడూరు ఉపకేంద్రములో మాతా శిశు సంరక్షణలో భాగంగా గ్రామీణ స్థాయిలో వైద్య ఆరోగ్య సేవలు అందించుటలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, రక్తశాతం పరిశీలన, ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్, ప్రధానమంత్రి మాతృ వందన యోజన, జననీ సురక్ష యోజన, జనని శిశు సురక్ష యోజన పథకములు, వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం నిర్వహణకు, సంబంధించిన ఆన్‌లైన్ వర్క్, రికార్డులు పరిశీలన చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం మధ్యాహ్నం చిల్లకూరు మండలంలోని చిల్లకూరు, చింతవరం, వరగలి, వల్లిపేడు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంల వైద్యాధికారులకు, పర్యవేక్షకులకు, గ్రామీణ ఆరోగ్య ఉప కేంద్రముల సామాజిక ఆరోగ్య అధికారులకు, సచివాలయం ఆరోగ్య కార్యకర్తలుకు, ఆశా కార్యకర్తలకు చిల్లకూరు ఎంపిడిఓ కార్యాలయం నందు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం సిబ్బంది, టాస్క్‌ఫోర్స్ టీమ్, తిరుపతి జిల్లా డాక్టర్ డిపిఎంఒ పి. శ్రీనివాస రావు, ఎస్ఒ సి. నాగేంద్ర కుమార్, డిపిహెచ్ఎన్ఓ ఎ. బేబీ రాణి, డిపిఓ పి. ప్రకాష్, డాక్టర్ సయ్యద్ షాలోమ్ అరాఫత్, డాక్టర్ పాల్ జాన్సన్, డాక్టర్ కళ్యాణ్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## బీడు భూములను గుర్తించండి

– విఎఎలకు ఏడి సుచేంద్రప్రసాద్ సూచన

చిట్టమూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త



ఆయా పంచాయతీల్లో ఖాళీగా ఉండే పంట పొలాలు, బీడు భూములను త్వరితగతిన గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని నాయుడుపేట వ్యవసాయశాఖ ఇన్‌ఛార్జ్ ఎడి సుచేంద్రప్రసాద్ విఎఎలకు సూచించారు. బుధవారం చిట్టమూరు రైతు సేవా కేంద్రంలో విఎఎలతో సమావేశమైన ఆయన గ్రామ రెవెన్యూ పటాల ద్వారా ఏ సర్వే నంబర్లలో పంట నమోదు కాలేదో గుర్తించి అందుకు గల మూడు రకాల అంశాలపై కారణాలను వివరించాలని తెలిపారు. ఇందులో భాగంగా ఒక సంవత్సరంలోపు ఖాళీగా ఉండే భూములు, ఒకటి నుంచి ఐదు సంవత్సరాలు పంటలు లేని భూముల వివరాలతో పాటు గత ఐదేళ్ల కాలంగా ఎంత విస్తీర్ణం సాగులో లేదో త్వరితగతిన గుర్తించాలన్నారు. అలాగే ఆయా రైతు సేవా కేంద్రాలకు చేరుకున్న పచ్చిరొట్ట ఎరువుల అమ్మకాలను ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని సూచించారు.

................

## కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి

– నాలుగు మండలాల విలేఖరులు డిమాండ్

చిట్టమూరు, ఆగస్టు 28 ప్రభాతవార్త



చిట్టమూరు పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ చంద్ర మండలంలో నిర్వహిస్తున్న వివిధ రకాల దందాలపై మంగళవారం ఓ పత్రికలో కథనం ప్రచురితమైంది. అయితే పత్రిక వార్తా కథనాన్ని జీర్ణించుకోలేని కానిస్టేబుల్ విలేఖరి గ్రామానికి వెళ్లి దుర్భాషలాడటంతో పాటు అదేరోజు రాత్రి సాక్షాత్తు చిట్టమూరు పోలీసుస్టేషన్‌లోనే డ్యూటీలో ఉండగా పూటుగా మద్యం సేవించి విలేఖరిని నానా దుర్భాషలాడి దౌర్జన్యం చేశారు. స్థానిక ఎస్ఐ చినబలరామయ్య సమక్షంలోనే ఈ తంతు అంతా జరిగినప్పటికీ ఎస్ఐ వారిస్తున్నా వినకుండా విలేఖరిని నానా దుర్భాషలాడి దౌర్జన్యం చేశారు. దీంతో సదరు విలేఖరి గూడూరు డిఎస్పీకి విషయాన్ని తెలియజేయడంతో ఆ కానిస్టేబుల్‌ను వాకాడు ప్రభుత్వాసుపత్రికి తరలించి మద్యం సేవించారో లేదో నివేదికలు తెప్పించుకున్నారు. ఈ విషయంపై భగ్గుమన్న కోట, వాకాడు, చిట్టమూరు, నాయుడుపేట, దొరవారిసత్రం జర్నలిస్టు సంఘాలు, విలేఖరులు, పత్రికా యజమానులు బుధవారం ఎస్ఐ చిన బలరామయ్యను కలిసి విలేఖరులపై జులుం ప్రదర్శించిన చంద్రపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని, అలా కాని పక్షంలో జిల్లా వ్యాప్తంగా న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. దీనిపై ఎస్ఐ స్పందిస్తూ ఇప్పటికే కానిస్టేబుల్ చంద్రపై కేసు నమోదుకు రంగం సిద్ధం చేశామని, సెక్షన్ 506తో పాటు కోట జడ్జి అనుమతితో మరో సెక్షన్ కూడా కలిపి కేసు నమోదు చేస్తామని హామీ ఇవ్వడంతో వారంతా వెనుతిరిగారు. సమాజంలో ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉండే జర్నలిస్టులపైనే, అందులోనూ పోలీసుస్టేషన్‌లోనే పోలీసు సిబ్బంది దాడులకు తెగబడుతుంటే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటన్నది ఉన్నతాధికారులే తేల్చాల్సి ఉంది.

## నరసింహారావు విఆర్‌కి, కొండప్పనాయుడు తడకి

తడ, ఆగస్టు 28 ప్రభాతవార్త



తిరుపతి జిల్లాలో తమిళనాడు సరిహద్దుల్లోని తడ పోలీసుస్టేషన్‌కు నూతన ఎస్ఐగా కె.కొండప్పనాయుడును నియమించారు. ఇక్కడ ఇప్పటిదాకా ఎస్ఐగా ఉన్న నరసింహారావును తిరుపతి విఆర్‌కు పంపించారు. విఆర్‌లో ఉన్న కొండప్పనాయుడును తడ ఎస్ఐగా నియమించారు. బుధవారం నూతన ఎస్ఐ తడలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొత్త, పాత ఎస్ఐలను స్థానిక పోలీసుస్టేషన్ సిబ్బంది సత్కరించారు. ఒకరికి వీడ్కోలు చెబుతూ, మరొకరిని స్వాగతించారు. ఇప్పటిదాకా ఎస్ఐగా ఉన్న నరసింహారావు వివాదరహితునిగా పనిచేయడమే కాకుండా సరిహద్దుల్లోని పలు కీలక నేరాల పరిశోధనలో బాధ్యతగా వ్యవహరించారు. కొత్త ఎస్ఐ కూడా అదే క్రమంలో పనిచేయాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

## ప్రభుత్వ భూమి కోసం తప్పెట కళాకారుల వినతి

తడ, ఆగస్టు 28 ప్రభాతవార్త



తడ మండలం తప్పెట కళాకారులు బుధవారం డిప్యూటి తహశీల్దార్ శరత్‌కు భూమి కోసం వినతిపత్రాలు అందజేశారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో తప్పెట కళాకారులకు రెండు ఎకరాలు చొప్పున భూమిని ఇస్తామని హామీ ఇచ్చారని, ఆ హామీని ఇప్పుడు నెరవేర్చాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డప్పు కళాకారుల కమిటీ సభ్యుడు సుబ్బారావు, సిపిఎం నాయకుడు చంద్రశేఖర్, సిఐటియు మండల అధ్యక్షుడు రమణయ్య, కార్యదర్శి లక్ష్మయ్య, స్థానిక డప్పు కళాకారుల సంఘం అధ్యక్షుడు దూడల రఘు, కార్మికులు పాల్గొన్నారు.

## చరణ్ తేజ విద్యావతి వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే పాశెం సునీల్ కుమార్

గూడూరు, ఆగస్టు 28, ప్రభాతవార్త



గూడూరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు కుమారుడు చరణ్ తేజ, కోడలు విద్యావతి వివాహ వేడుకలు బుధవారం అంగరంగ వైభవంగా గూడూరు పట్టణంలోని పోటుపాలెం సర్కిల్‌లో ఏర్పాటైన దివ్య ఫంక్షన్ హాల్ నందు వివాహ వేడుకలు నిర్వహించారు. ఈ వివాహానికి శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్ ప్రముఖ పారిశ్రామికవేత్త తానంకి నానాజీతో పాటు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి గూడూరు నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పులిమి శ్రీనివాసులు కుటుంబ సభ్యులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని వివాహ దంపతులను ఆశీర్వదించారు.

## ఇంటిగ్రేట్ గ్లోబల్ సర్వీస్‌ను ప్రారంభించిన డాలర్ దివాకర్ రెడ్డి

తిరుపతి విద్య, ఆగస్టు 28, ప్రభాతవార్త



స్థానిక బైరాగిపట్టెడలో బుధవారం గ్లోబల్ సర్వీసెస్ సంస్థను డాలర్స్ గ్రూప్స్ చైర్మన్ అధినేత డాలర్ దివాకర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం డాలర్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి నగరం దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. దీనిలో భాగంగా విద్యార్థిని విద్యార్థులు ఉన్నత చదువులు కోసం విదేశాలకు వెళ్లి అక్కడ పడరాని పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మన స్థానికుడు తిరుపతిలో ఇంటిగ్రేట్ గ్లోబల్ సర్వీస్ ద్వారా సామాన్య మధ్య తరగతి పిల్లలకు ఆస్ట్రేలియా కెనడా, యూరప్, యూఎస్ఏ, న్యూజిలాండ్ వంటి దేశాలకు వెళ్లి సులభంగా చదువుకునే అవకాశాన్ని ఈ సంస్థ ద్వారా ఎటువంటి డిపాజిట్ లేకుండా విదేశాలకు పంపించే అవకాశం కల్పించడం అలాగే విద్యార్థిని విద్యార్థులకు వీసాలు కూడా ఇప్పించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఎటువంటి డిపాజిట్లు లేకుండా విద్యార్థిని విద్యార్థులు విదేశాలకు వెళ్లి మాస్టర్ డిగ్రీ, కంప్యూటర్, బిజినెస్ డేటా సైన్స్ వంటి ఉన్నత చదువులు చదువుకునే అవకాశాలను సంస్థ కల్పిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. మరిన్ని వివరాలకు 8919218881, 7780673424 లను సంప్రదించవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వర్ రెడ్డి, మురళి కుమార్, చక్రి, స్వప్న డాలర్స్ దివాకర్ రెడ్డి గ్రూప్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ది సస్టైనబుల్ డెవలప్మెంట్ ఛాలెంజస్ అనే అంశం పైన సదస్సు

తిరుపతి విద్య, ఆగస్టు 28, ప్రభాతవార్త



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన విభాగం, కేంద్రం శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఎకనోమెట్రిక్స్ విభాగ సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఎకనామిక్ రిలేషన్స్ ది సస్టైనబుల్ డెవలప్మెంటల్ ఛాలెంజస్ అనే అంశంపైన ఈ జాతీయ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ప్రొఫెసర్ కిరణ్ ప్రసాద్, ఇంచార్జి డీన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు. ప్రొఫెసర్ కె. అమృత లింగం, సీనియర్ ప్రొఫెసర్, ఎకనామిక్స్ శాఖ, కొలంబో విశ్వవిద్యాలయం శ్రీలంక కీలకోపన్యాసకులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం, శ్రీలంక పరస్పరం సహకరించుకుంటూ ఆర్థిక సంబంధాలు పెంపొందించుకొంటుందని చెప్పారు. డాక్టర్ ఆర్ముగం, తంజావూరు, ప్రొఫెసర్ కృష్ణమూర్తి, డాక్టర్ గీతాంజలి, ఐసిఎఫ్ఏఐ బిజినెస్ మేనేజ్మెంట్ హైదరాబాద్ సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్ గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్లు డాక్టర్ పి. మాధవి, డాక్టర్ సునీత, మహిళా అధ్యయన విభాగ ఇన్చార్జి హెడ్ డా. నీరజ, వివిధ విశ్వవిద్యాలయం, కాలేజీలు నుంచి పలువురు విద్యార్థులు, ఆచార్యులు, పరిశోధకులు పాల్గొన్నారు.

## ఇస్కాన్ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థినిలు

తిరుపతి విద్య, ఆగస్టు 28, ప్రభాతవార్త



శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినిలు శ్రీ కృష్ణ జన్మాష్టమి సందర్భంగా జరిగిన ఇస్కాన్ పోటీలలో నగదు, ప్రశంసాపత్రాల బహుమతులు పది మంది విద్యార్థినులు స్వీకరించారు. విస్తృత స్థాయిలో బహుమతులను అందుకున్న సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. నారాయణమ్మ విద్యార్థినులను అభినందించారు. వీరు మాట్లాడుతూ శ్రీ కృష్ణుడు జగద్గురువు అన్నారు. కృష్ణతత్వాన్ని విద్యార్థినులు గ్రహించాలన్నారు. శ్రీకృష్ణ కుచేలుల స్నేహబాంధవ్యాన్ని జీవితంలో అలవరచుకోవాలని విద్యార్థినులకు పిలుపునిచ్చారు. కళాశాల కోకరికులర్ కోఆర్డినేటర్ డా. కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థినులలో భక్తి భావాన్ని పెంపొందించడానికి ఇటువంటి పోటీలు ఉపయోగపడతాయన్నారు. శ్రీ కృష్ణుడు తన గురువైన సాందీపుని పట్ల చూపిన భావాన్ని విద్యార్థినులు ఆచరించాలని అన్నారు. యూనియన్ ఇంచార్జి డా.బి. జ్యోతి, గణిత శాస్త్ర అధ్యాపకులు డా. ధనలక్ష్మి, డా. మమత, తెలుగు అధ్యాపకులు డా. శోభ, కళాశాల అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు. డిబేట్ ఎం. పరిమళ మొదటి బహుమతి, పి. చందన మొదటి బహుమతి, ఇ. లావణ్య రెండవ బహుమతి, పి. లలిత రెండవ బహుమతి, సి. పుష్పలత మూడవ బహుమతి, వి. అంబిక మూడవ బహుమతి, వ్యాసరచన పోటీలలో ఎం. రాధాకుమారి మొదటి బహుమతి, బి. కుసుమ కన్సోలేషన్, వ్యాస రచన పోటీ, ఇంగ్లీష్ పోటీలలో కె. ఇంద్రజ రెండవ బహుమతి తెలుగులో మాట్లాడదాం పోటీలలో వి. అంబిక మొదటి బహుమతి సాధించారు.

## ఎస్వియూలో ఘనంగా సినీ నటుడు సుమన్ జన్మదిన వేడుకలు

తిరుపతి విద్య, ఆగస్టు 28, ప్రభాతవార్త



ప్రముఖ సినీనటుడు సుమన్ పుట్టిన రోజు సందర్భాన్ని పురస్కరించుకొని ఎస్వీయూలో రాష్ట్ర బిసి విద్యార్థి సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్వీయూ ప్రధాన ద్వారం వద్ద ఘనంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. నారాయణ గౌడ్ మాట్లాడుతూ సినీ పరిశ్రమలు స్వయం కృషితో అంచలంచెలుగా ఎదిగిన గొప్ప పేరు ప్రఖ్యాతులు తెచ్చుకొని పౌరాణిక పాత్రలలో కూడా ప్రజలను మెప్పించి నటుడు సుమన్ అని కొనియాడారు. ప్రధానంగా అన్నమయ్య సినిమాల్లో శ్రీ వెంకటేశ్వర స్వామి పాత్ర ప్రపంచంలోని శ్రీవారి భక్తుల హృదయాలను ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి టిటిడి పాలక మండలిలో సముచిత న్యాయం కల్పించాలని నారాయణ గౌడ్ ఆకాంక్షించారు. ఈ వేడుకలలో సుమాన్ అభిమానులు, సురేంద్ర నాయుడు, మాధవ్, నారాయణస్వామి గౌడ్, వెంకటాద్రి యాదవ్, పురుషోత్తం గౌడ్, శ్రీనివాసులు, రవి, కోదండరామిరెడ్డి, పవన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తాగి వాహనం నడిపితే జైలే

తిరుపతి, ఆగస్ట్ 28ప్రభాతవార్త:



తిరుపతినగరంలో ప్రమాదాల నివారణలో భాగంగా మద్యంసేవించి బండెక్కితే జైలుకు పంపడానికి పోలీసులు సిద్ధమవుతున్నారు. మద్యం సేవించి మత్తులో వాహనాలు నడిపిన 9మంది డ్రైవర్లకు జరిమానాతో బాటు జైలుశిక్ష అమలుచేశారు. తాగి వాహనంనడిపితే 10వేల రూపాయలు జరిమానా విధిస్తున్నారు. నిబంధనలు అతిక్రమించినా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించినా జరిమానాలు, శిక్ష తప్పదని తిరుపతి ట్రాఫిక్ డిఎస్పీ రామకృష్ణమాచారి తెలిపారు.

## నియోజకవర్గ అభివృద్ధి సుధీర్‌రెడ్డితోనే సాధ్యం

శ్రీకాళహస్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త



తెదేపా ప్రభుత్వం ఏర్పడిన 65రోజుల్లోనే శ్రీకాళహస్తిలో బొజ్జలసుధీర్‌రెడ్డి తనదైన శైలిలో పాలన కొనసాగిస్తున్నారని పలువురు తెదేపా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ కార్యాయలంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ 65రోజుల పాలనపై మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు చెంచయ్యానాయుడు, పార్టీ అధ్యక్షులు విజయకుమార్, సుబ్బారెడ్డి, కంటా రమేష్, మిన్నల్‌రవిలు మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో జరుగుతున్న అభివృద్ధి ప్రజల స్వేచ్ఛ కోసం ఫ్రెండ్లీ పోలింగ్ వ్యవస్థను చూసి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గెలిచిన వారం రోజుల్లోనే శ్రీకాళహస్తి దేవస్థానాన్ని ప్రక్షాళన చేసి గుడి ఆదాయం పెంచారని గత ప్రభుత్వ హయాంలోదేవస్థానం నందు వస్తున్న ఆదాయం కంటే రూ.1.2కోట్లు ఎక్కువ వచ్చేలా చేయాలని తెలిపారు. రాజీవ్‌నగర్‌లో అక్రమని ర్మాణాలను కూల్చివేసికబ్జాకు గురైన స్థలాలను నిజమైన లబ్ధిదారులకు అందించడం జరిగిందన్నారు. రమేష్, గోపి, సుబ్రమణ్యంనాయుడు, విజయకుమార్ కిట్టు, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

## తొట్టంబేడు ఎస్ఐగా ఈశ్వరయ్య బాధ్యతలు స్వీకరణ

.తొట్టంబేడు, ఆగస్టు 28 ప్రభాతవార్త



తొట్టంబేడు ఎస్ఐగా యర్రావారిపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న కె.ఈశ్వరయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన శ్రీకాళహస్తిరూరల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ప్రభుత్వం తొట్టంబేడు ఎస్ఐగా నియమించారు. ఇక్కడ సమర్థవంతంగా విధులు నిర్వహించిన రాఘవేంద్ర భాకరాపేట పోలీస్‌సేషన్‌కు బదిలీ ఆయ్యారు. ఈసందర్భంగా నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఈశ్వరయ్య మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలుతీసుకుంటామన్నారు.

## కరాటేలో సత్తాచాటిన ఎంజిఎం స్కూల్ విద్యార్థి

శ్రీకాళహస్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త



కరాటేలో సత్తాచాటిన ఎంజిఎం పాఠశాలలో చదువుతున్న యుకెజి విద్యార్థిని కె. ప్రియదర్శిని 2024 పొన్నేరిలో ఆల్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో ద్వితీయస్థానం సాధించడంతో ఎంజిఎం విద్యాసంస్థల అధినేత, డైరెక్టర్ గుద్లూరు మయూర్ విద్యార్థిని అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచి విద్యార్థులకు క్రీడలు మీద మక్కువ కలిగేలా తల్లిదండ్రులు శ్రద్ధ మరియు చొరవ తీసుకోవాలని ఈ వయస్సు నుంచే వారికి లక్ష్యం అంటూ ఏర్పరిస్తే భవిష్యత్తులో ఒలింపిక్స్ స్థాయికి వెళ్తారని ఈసందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## "డక్ చౌపాల్"యువత సద్వినియోగంచేసుకోండి

-సెట్విన్ సిఈఓ మురళీకృష్ణ

తిరుపతి, ఆగస్ట్ 28ప్రభాతవార్త:

రాష్ట్ర యువజనవిభాగం ఆదేశాలతో తపాలశాఖ సహకారంతో "డక్‌చౌపాల్"కార్యక్రమం ప్రారంభ వుతోందని, దీన్ని యువత విజయవంతం చేయాలని సెట్విన్ సిఈఓ డాక్టర్ వి.మురళీకృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో యువతను నిమగ్నం చేయడం, తపాలశాఖ, ప్రభుత్వ పనితరుపై విలువైన కార్యకలాపాలను, సమాచారం, సేవలు, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కార్యకలాపాలు అంవాలను మారుమూల గ్రామీణప్రాంతాల వారికి తెలియజేయడం జరుగుతుందన్నారు. 29ఏళ్ళలోపు గ్రాడ్యుయేట్, అండర్‌గ్రాడ్యుయేట్ యువతను లక్ష్యంగా చేసుకుని ఈ కార్యక్రమం రూపొందించడం జరిగిందన్నారు. తపాలసేవలను పొందడం, తపాలశాఖ పనితీరు, డాక్‌చౌపాల్‌లో పాల్గొనడం జరగాలి. కమ్యూనిటీ వాలంటీరింగ్‌ను ప్రోత్సహించడం, యువత స్థానిక, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువచేయడం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మరిన్ని వివరాలకు మైభారత్ పోర్టల్ హెచ్‌టిటిపిఎస్ //మైభారత్.జివోవి.ఇన్‌లోఆసక్తి అర్హత గ ఉవత నమోదు చేసుకోవాలన్నారు.

## తిరుమెర్ల జయచంద్రారెడ్డి మరణం తీరని లోటు

బుచ్చినాయుడు కండ్రిగ, ఆగస్టు 28 ప్రభాతవార్త:



ఆపద్బంధువు తిరుమెర్ల జయచంద్రారెడ్డి ఆకస్మికంగా మృతి చెందడం వైసీపీ పార్టీకి తీరని లోటని సత్యవేడు నియోజకవర్గ వైసీపీ పార్టీ సమన్వయకర్తనూక తోటి రాజేష్ తెలిపారు. బుధవారం వెస్ట్ వరతూర్ స్వగ్రామంలో జరుగుతున్న తిరుమెర్ల జయచంద్రారెడ్డి అంత్యక్రియలకు హాజరై ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు మోక్షం కలగాలని భగవంతుని ప్రార్థించారు. పేదవాళ్ళను ఆదుకుంటూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహించే వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలు కతీతంగా పలువురు నాయకులు అంత్యక్రియ కార్యక్రమాలకు హాజరై నివాళులర్పించడం జరిగింది. ఆయన అంత్యక్రియ కార్యక్రమాలు ఘనంగా కుటుంబ సభ్యులు నిర్వహించారు.

## వాడవాడలా గంగజాతర వేడుకలు

పుత్తూరురూరల్, ఆగస్టు 28 ప్రభాతవార్త:



పుత్తూరు మండల పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో గంగజాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కైలాసపురం గ్రామంలో గంగమ్మను, ఔనాక్షమ్మను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో గంగజాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిరుమలకుప్పం గ్రామంలో గంగమ్మలు(రెండు గంగమ్మలను) ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పురవీధుల్లో డప్పు వాయిద్యాలు, ప్రత్యేకవిద్యుత్ దీపాలంకరణతో పురవీధుల్లో గంగమ్మలను ఊరేగించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని గంగమ్మలకు మధ్యాహ్నం కుంభం కార్యక్రమం, సాయంత్రం పిండి దీపాలు అనంతరం ఆయా గ్రామాల్లోని గంగమ్మలను ఊరేగించి నిమజ్జనం కార్యక్రమం చేపట్టారు. భక్తులు అమ్మవార్లకు మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు. గంగమ్మలను దర్శించుకున్న ఎమ్మెల్యే మండల పరిధిలోని కైలాసపురం పరమేశ్వరమంగళం తిరుమలకుప్పం గ్రామాల్లో నిర్వహించిన గంగజాతరల్లో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. గంగజాతర నిర్వహించిన గ్రామాల్లో ఆయనకు పూలమాలలు వేసి శాలువలు కప్పి ఘనంగా సన్మానించి ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలుపాల్గొన్నారు.

## ఘనంగా హీరో సుమన్ జన్మదిన వేడుకలు



**రేణిగుంట, ఆగస్టు 28 ప్రభాతవార్త:** ప్రముఖ నటుడు సుమన్ పుట్టిన రోజు సందర్భంగా రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ అమర రాజా లిమిటెడ్ కంపెనీలో గల్లా అరుణ కుమారి స్వగృహంలో అమర రాజా ఫౌండర్ చైర్మన్ గల్లా రామచంద్రనాయుడు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఆధ్వర్యంలో సుమన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం గల్లా రామచంద్రనాయుడు, గల్లా అరుణకుమారి సుమన్‌ను సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో అమరరాజా సంస్థ ఉద్యోగులు సుమన్ అభిమానులు పాల్గొన్నారు.

## నాటు సారా స్థావరాల పై పోలీసులు దాడులు

- వెయ్యి లీటర్ల నాటు సారా ఊట ధ్వంసం



వెదురుకుప్పం, ఆగస్టు 28 ప్రభాతవార్త : నాటు సారా తయారీ స్థావరాల పై దాడి చేసి సుమారు వెయ్యి లీటర్ల నాటు సారా ఊటను ధ్వంసం చే సిన్నట్లు ఎస్ఐ వెంకట సుబ్బయ్య బుధవారం తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి .... మండలంలోని కురివికుప్పం అటవీ ప్రాంతంలో నాటు సారా తయారీ స్థావరాల పై సిబ్బందితో దాడులు నిర్వహించగా నాటు సారా తయారీకి అవసరమైన ఊట లభ్యమైయిందని దా నిని ధ్వంసం చేసిన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా తయారు చేయడం, విక్రయించడం నేరమని ప్రజలు గుర్తిం చాలన్నారు. చట్టవ్యతిరేకంగా నాటు సారా తయారు చేసి విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సారా తయారీ సమాచారం అందించి పో లీసులకు సహకరించాలన్నారు. గ్రామంలో ఎక్కడ నాటు సారా తయారీ చేయకుడదని, సారా సేవించడం వలన వచ్చే దుష్పరిణామాలను వివరిం చారు. కార్యక్రమంలో సిబ్బంది కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## దిగ్విజయంగా శ్రీకృష్ణ భగవానుడు ఊరేగింపు

ఏర్పేడు, ఆగస్టు28, ప్రభాతవార్త;



మండలంలోని చింతలపాళెం గ్రామంలో బుధవారం శ్రీకృష్ణ భగవానుని ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. త్రైత సిద్ధాంత ప్రభోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక శ్రీకాళహస్తి కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి రోజు అనగా ఆగస్టు 26న సోమవారం నాడు చింతలపాళెం గ్రామం సెంటర్ వద్ద వేదిక నిర్మించి శ్రీకృష్ణుడి ప్రతిమలను కొలువు తీర్చి ప్రతి రోజూ ఉదయం సాయంత్రం జ్ఞాన రీత్యా నిత్య పూజలు, భగవద్గీత శ్లోక నిత్య పారాయణం చేసి 3వ రోజు బుధవారం శ్రీకృష్ణ ప్రతిమ ఊరేగింపు కార్యక్రమం వేదిక నుండి ఊరేగింపు గ్రామం అంతా జరిగింది. ఈకార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రభోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక శ్రీకాళహస్తి కమిటీ అధ్యక్షులు చింతా సుబ్రమణ్యం యాదవ్, వెంకటలక్ష్మి, రాజేష్ యాదవ్, సురేష్ యాదవ్, పెంచులయ్య, సుధ, శ్రీనివాసులు, జ్ఞాన సందేశ్, ఆమంతి, అమరావతి, శ్రీదేవి, రంగయ్య, జయసుధ, ధనంజయులు, ధనరాజ్, లీలాకృష్ణ, ప్రభోధకృష్ణ. జస్విక్, జ్ఞాన వాహిని, ఉదయ్ కిరణ్, తిరుమల, తిరుమలేష్, తదితరులు పాల్గొన్నారు. పీలేరు ప్రభోధ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## లైన్‌మెన్ అదృశ్యం

వడమాలపేట, ఆగస్టు 28 ప్రభాతవార్త:



మండలంలోని అప్పలాయగుంట సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్‌గాపని చేస్తున్న ఉమాశంకర్ అదృశ్యమయ్యాడు. వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డికథనం మేరకు... పుత్తూరు బెస్తవీధిలో కాపురం ఉంటున్న ఉమాశంకర్(46)2004లో కరెంటు డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగంలో చేరాడు. గత ఏడాది అప్పలాయగుంట సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మెన్‌గా బదిలీపై వచ్చాడు. సోమవారం ఉదయం డ్యూటీకి వచ్చిన ఉమాశంకర్ మంగళవారం ఉదయం డ్యూటీ దిగాడు. క్యారీ, బ్యాగు ఆఫీసులోనే వదిలి వెళ్లిపోయాడు. ఉమాశంకర్ భార్య మయూరి పుత్తూరులోని ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తుంది. మంగళవారం సాయంత్రం కూడా భర్త ఇంటికి రాకపోవడం, ఫోన్ స్విచాఫ్ చేసి ఉండడంతో అప్పలాయగుంట సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసింది. ఉదయమే డ్యూటీ దిగి వెళ్లిపోయాడని చెప్పడంతో వడమాలపేట పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. ఉమాశంకర్‌కు కరోనా వచ్చిందని సుమారు 8 లక్షల వరకు ఖర్చయిందని అప్పటి నుంచి కొంత డిప్రెషన్‌లో ఉన్నట్లు పోలీసులకు తెలిపింది. కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ధర్మారెడ్డి తెలిపారు.

## జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడి మాతృవియోగం



**విజయపురం, ఆగస్టు 28 ప్రభాతవార్త:** జిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు, రాష్ట్ర టీడీపీ బీసీసెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనంజయయాదవ్ మాతృమూర్తి సక్కుబాయమ్మ(75) అనారోగ్యంతో బుధవారం మండల కేంద్రమైన విజయపురంలో మృతి చెందింది. ఆమె మృతిపట్ల పలువురు టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఉదయం 11 గంటలకు దహన క్రియలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

## కేసీసీ లోన్లను రెన్యూవల్ చేసుకోండి - ఎస్‌బీఐ మేనేజర్

**విజయపురం, ఆగస్టు 28 ప్రభాతవార్త:** కేసీసీ లోన్లను రెన్యూవల్ చేసుకోవాలని పన్నూరు స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ రామాంజనేయులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పన్నూరు బ్యాంకు ఆవరణలో రైతులకు సమావేశం నిర్వహించారు. ప్రతి రైతు సకాలంలో లోన్లను రెన్యూవల్ చేసుకుంటే వడ్డీరేట్లు తగ్గుతుందన్నారు. ప్రతి రైతుకు కొత్త లోన్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

## కష్టపడిన వారికి గుర్తింపు

-టిడిపి కార్యకర్తలకు మంత్రి లోకేష్ ప్రశంస

తిరుపతి, ఆగస్ట్ 28ప్రభాతవార్త:



పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుంది....సామాన్యకార్యకర్తలను అగ్రనాయకులతో సమానంగా గౌరవిస్తామని ఇచ్చిన హామీతో యువనేత, మంత్రి నారాలోకేశ్ సంతకాలు చేసిన ప్రశంసాపత్రాలను తిరుపతిలో సుగుణమ్మ అందజేశారు. పార్టీకోసం ప్రతి ఒక్కరూక్రమశిక్షణతో నిబద్ధతో పనిచేయాలన్నారు.

# తిరుపతి డివిజన్

## సత్యవేడు ఎస్ఐగా ఓ రామస్వామి



**సత్యవేడు, ఆగస్టు 28, ప్రభాతవార్త:** సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఎస్ఐ ఓ రామస్వామి నూతనంగా ఉద్యోగ భాద్యతలను చేపట్టారు. అలిపిరి ఎస్ఐగా పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు , ట్రాఫిక్ సమస్యల నియంత్రణలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని తెలిపారు.

## పేరూరు కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల పరంపర

తిరుపతిరూరల్, ఆగష్టు28 ప్రభాతవార్త:



పేరూరు గ్రామ పంచాయతీలో అక్రమ నిర్మాణాలు పరంపర కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా 530/3లో కాల్వపోరం బోకు రేఖుల నిర్మాణం చేసి, రెవెన్యూ అధికారులకు సవాల్ విసిరారు అక్రమ నిర్మాణదారులు. తిరుపతిరూరల్ మండలం లో ఖరీదైన ప్రభుత్వ భూములు అన్యక్రాంతమైతూనే ఉన్నాయి. రెవెన్యూ అధికారుల ఉదాసీనత, అధికార ఒత్తిడిలతో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. పేరూరులో కాల్వపోరం భూమిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై కొరఢా ఝళిపించాలని స్థానికులు కొరుతున్నారు.

## మేడిపండులా దామలచెరువు రోడ్ బ్రిడ్జ

గత దశాబ్ధ కాలంగా మరమ్మతులకు సైతం నోచుకోని పరిస్థితి



**పాకాల, ఆగష్టు 28, ప్రభాతవార్త** పాకాల మండలం దామలచెరువు గ్రామం ఊరు మధ్యలో వంక పై ఉన్న రోడ్డు బ్రిడ్జి శిధిలావస్థలోకి చేరింది. నిత్యం ఈ బ్రిడ్జి పై బరువైన వాహనాలు ప్రయాణిస్తూ ఉండడం ఇది కాక వేరే ప్రత్యాయమైన మార్గం లేకపోవడం బ్రిడ్జి పై వాహన రద్దీ ఎక్కువగా ఉండటం బ్రిడ్జి కింద భాగంలో పెద్ద ఎత్తున సిమెంట్ పిల్లలు ఊడిపోయి పైకి కమ్ములు తేలి వంతెన పై వాహన రాకపోకలకు పెను ప్రమాదం పొంచి ఉంది. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే దృష్టి సారించి బ్రిడ్జికి మరమ్మత్తులు చేసి పటిష్ట పరచవల్సిందిగా వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

## శ్రీ వాణి నిధులతో తిరుపతి మధ్య తరగతి ప్రజలకు కళ్యాణ మండపాలను నిర్మించాలి

వైసిపి పాలనలో దోచేసిన అవినీతిపరులకు జైలు తప్పదు , జనసేన నేత కిరణ్ రాయల్

తిరుపతి హెల్త్, ఆగస్టు 28, ప్రభాతవార్త



టిటిడి, శ్రీ వాణి ట్రస్ట్ నిధులను గత వైసిపి పాలనలో దేవాలయాలు నిర్మించామన్న ముసుగులో శ్రీవారి సొమ్మును దోచేశారని, వారందరికి జైలు శిక్ష తప్పదని జనసేన పార్టీ తిరుపతి ఇంచార్జి కిరణ్ రాయల్ బుధవారం మీడియా సమావేశంలో పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఉన్న ప్రాంతంలో ఎక్కడ పెళ్లి చేసినా పవిత్రత ఉంటుందన్న నమ్మకంతో హోటల్స్, రిసార్ట్స్‌లలో లక్షలు పోసి పెళ్లిళ్లు చేసుకుంటున్నారన్నారు. టిటిడి శ్రీ వాణి ట్రస్ట్ నిధులతో తిరుపతిలో కళ్యాణ మండపాలు నిర్మిస్తే మధ్య తరగతి కుటుంబాల వారు అప్పుల పాలు కాకుండా పెళ్లిళ్లు చేసుకుంటారని తెలియజేశారు. తిరుపతిలో ఎన్ని మ్యారేజ్ హాల్స్ ఉన్నా తక్కువేనని, దేశంలో అనేక చోట్ల టిటిడి కళ్యాణ మండపాలు ఉన్నాయని, వాటిని కూడా ఆధునికరణ చేయాలని కోరారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్తామన్నారు. టిటిడికి సంబంధించి అనేక స్థలాలు ఉన్నాయని, వాటిలో కళ్యాణ మండపాలను నిర్మించాలని అదే విధంగా టిటిడి ఆస్తులను కూడా సంరక్షించాలని కిరణ్ రాయల్ కోరారు. ఈ మీడియా సమావేశంలో హేమ కుమార్, సుమన్ బాబు, కిషోర్, శ్రీనివాసులు, ఆది, సుమంత్, బాలు, రాజేంద్ర, లోకేష్, భాను, సుధ తదితరులు పాల్గొన్నారు.

## జవాబుదారితో విధి నిర్వహణ: అవార్డుల పండగ

శ్రీకాళహస్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మున్సిపాలిటి అభివృద్ధికి జవాబుదారితనంతో పని చేసిన కమిషనర్ రమేష్‌బాబు ఎసేవలు అనిర్వచనీయమని మున్సిపల్ సిబ్బంది, ఇ ంజనీరింగ్ విభాగం పట్టణానికి చెందిన పలువురు అభినందించారు. ఆయన పట్టుదలగా పని చేస్తూ సిబ్బంది దగ్గర పని చేయించారు. కాబట్టి రెండు సార్లు ఉత్తమ మున్సిపాలిటి అవార్డులను అందుకున్నట్లు పలువురు అన్నారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో గతంలో ఒరెండు సంవత్సరాలు ప్రస్తుతం 15 నెలల పాటు పని చేసిన కమిషనర్ జనరల్ ఫ ండ్స్‌ను అభివృద్ధి చేయటంలో వార్డుల్లో సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రతినిధుల సూచనలతో ప్రణాళికలను ఇంజనీరింగ్ విభాగంతో పని చేయించటం అభినందనీయం అన్నారు. సిబ్బందిని ఇబ్బంది పెట్టకుండా ఆడుతూ పాడుతూ పనులు చేయించారన్నారు. అలాంటి అధికారి మరో మూడు సంవత్సరాలుంటే ఇంకా ఎంతో అభివృద్ధి జరిగేదన్నారు. ప్రస్తుతం అన్నా క్యాంటిన్ల ఏ ర్పాటు, టిడ్కో గృహాలను పూర్తి చేయటానికి అలాగే అభివృద్ధికి సంబంధించిన పనుల అంచనాల ప్రతిపాదనల్లో ఆయన ఇంజనీరింగ్ అధికారులను రేయింబవళ్ళు పని చేయించారన్నారు. డిఇఇ లలిత ఎఇఇ సింధూ, మేనేజర్ ఉమామహేశ్వరరావు, ఆర్ఓ నారాయణరెడ్డి, రెవెన్యూ ఇన్సె పెక్టర్లు బాలచంద్ర, రవికాంత్, సీనియర్ అసిస్టెంట్లు సురేష్, జావెద్, టిపిఓ మధుసూదన, షాజహాన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వాసవి అమ్మవారి ఆత్మార్పణదినోత్సవాన్ని అధికారికం చేయటం అభినందనీయం



శ్రీకాళహస్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికం చేయటం అభినందనీయమని ఆర్యవైశ్యులకు ప్రభుత్వం ఇచ్చే గుర్తింపుకు నిదర్శనం అని మాజీ పట్టణ అధ్యక్షుడు వాకచర్ల గుర్రప్పశెట్టి అన్నారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించటానికి మంత్రి మండలిలో ఆమోదించటం శుభ సూచకమన్నారు. ఈ అంశాన్ని తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ఎన్నికల మెనిఫెస్టోలో పొందుపరచారని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవటానికి నిదర్శనం అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలిలో ప్రతి సారి అవకాశం కల్పించారన్నారు. ఆర్యవైశ్యులపై బొజ్జల కుటుంబానికి గల గుర్తింపుకు ఇదే నిదర్శనం అన్నారు. అంతేకాక ఆర్యవైశ్య వ్యాపారులకు ఎంతో తోడుగా ఉండేవారన్నారు. ఆర్యవైశ్యులకు పార్టీ గుర్తింపు ఉంటుందన్నారు.

## కమిషనర్‌ను సత్కరించిన దేశం నాయకులు,సిబ్బంది

శ్రీకాళహస్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా విశిష్ట సేవలందించిన ఎం.రమేష్‌బాబు పొన్నూరుకు బదిలీ అయిన సందర్భంగా ఆయనను బుధవారంఒ వైపు మున్సిపల్ సిబ్బంది, మరో వైపు పట్టణ ప్రముఖులు, తెలుగుదేశం నాయకులు సన్మానాల్లో ముంచెత్తారు. శ్రీకాళహస్తి మున్సిపల్ అభివృద్ధిలో జవాబుదారితనంతో వ్యవహరించిన రమేష్‌బాబు 2017 నుంచి 2019 వరకు తెలుగుదేశం పాలనలో ప్రస్తుతం మూడు నెలలుగా తెలుగుదేశం పాలనలో పని చేసారు. ప్రజా ప్రతినిధుల ప్రణాళికలను అమలు చేయటంలో కమిషనర్ ఎంతో చిత్తశుద్ధితో పని చేసే వారు. ఆయనను బుధవారం మున్సిపల్ కార్యాలయ సిబ్బంది నాయకులు దుశ్శాలువలతో పూల మాలలతో సత్కరించారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు, సుధాకర్, గుత్తా.విజయకుమార్, గోపి తదితర దేశం నాయకులు పాల్గొన్నారు.

## దర్గా ఉరుసుకు సుమన్‌కు ఆహ్వానం

శ్రీకాళహస్తి, ఆగస్టు 28 ప్రభాతవార్త



వచ్చేనెల చివరి వారంలో అంగరంగ వైభవంగా భక్తి భావంతో నిర్వహించే జుంలేపీర్ వలీ అల్లాహ ఉరుసుమహోత్స వానికి రావాలని ప్రముఖ సినీనటుడు డాక్టర్ సుమన్ తల్వార్‌ను ఆహ్వానిం చారు. ఈ మేరకు దర్గా కమిటికి చెందిన సయ్యద్ అహమ్మద్, సయ్యద్ బాబాఫరీద్ సారధ్యంలో కమిటి సభ్యులు హాజరయ్యారు. సుమన్ వారిని సాదరంగా ఆహ్వానించి తాను శ్రీకాళహస్తికి వస్తే బాబా దర్గాను తప్పక దర్శించుకోవటం ఆనవాయితి అని తప్పక బాబా ఉరుసు మహోత్సవంలో పాల్గొంటానని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. కాగా సుమన్ జన్మదిన సందర్భంగా బాబా చాదర్‌తో సత్కరించారు. ఈ కమిటి అధ్యక్షులు ఒరుగంటి నాగేశ్వరరావు, ఆర్గనైజర్ జి.రాజేశ్వరరావు ఎంఎస్ జమురుద్‌బాషా, ఆటో యూనియన్ అధ్యక్షులు జుంలేషా, రహీమ్‌ఖాన్, మహమ్మద్‌యాకూబ్‌లు హాజరయ్యారు.

## చిరుధాన్యాల సాగుపై అవగాహన

తిరుపతి, ఆగస్ట్ 28ప్రభాతవార్త:



తిరుపతి జిల్లా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం, ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌వి సరళ చిరుధాన్యాలసాగుపై రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం ఉదయం తిరుపతి రూరల్ పెరుమాళ్లపల్లిలె రైతులతో సమావేశమై చిరుధాన్యాల పంటలు పండించటం, వాటిని పోషకవిలువలు ప్రయోజనాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ బి. సంధ్యారాణి, శాస్త్రవేత్తలు డాక్టర్ బి.వజంత, డాక్టర్ ఎం.వళ్ళీదేవి, కెఆర్ తాగూర్ ,డాక్టర్ నాగమణి పాల్గొన్నారు.

